క్లుప్తంగా

బ్రిడ్జి పనులు ప్రారంభం



మల్రిపల్లిలో ప్రారంభమైన బ్రిడ్జి పనులు

సాక్షి ఎఫెక్ట్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మల్రిపల్లి గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. సాక్షి దినపత్రికలో ఈ నెల 13న 'వంతెన నిర్మించేదెప్పుడో'.? అనే కథనానికి స్పందిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. వేములవాడ నుంచి కోరుట్లకు వెళ్లే ఈ కల్వర్టు వద్ద రూ.2 కోట్లతో లోలెవెల్ వంతెన నిర్మించేందుకు 2022 సెప్టెంబర్ 11న ఎమ్మెల్యే రమేశ్‌బాబు భూమిపూజ చేశారు. సాక్షి కథనంతో పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేటీఆర్ చేతుల మీదుగా అవార్డులు



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మండల సర్పంచులు

తంగళ్లపల్లి: మండలానికి చెందిన పలు గ్రామాల సర్పంచులు సోమవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు అందుకున్నారు. తంగళ్లపల్లి మండలానికి చెందిన కస్బేకట్కూర్, రామన్నపల్లి, చీర్లవంచ గ్రామాలకు జిల్లాస్థాయి అవార్డు రావడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పడిగెల మానస, సర్పంచులు వల్లకొండ వేణుగోపాలరావు, జక్కుల రవీందర్, ఆత్మకూరి రంగయ్య, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, ఎంపీడీవో లచ్చాలు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ అన్ని రంగాల కార్మికులు ఏప్రిల్ 5న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో చలో ఢిల్లీ పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, హమాలీ సంఘం అధ్యక్షుడు పెగ్గెర్ల శంకర్, అలువాల అంజయ్య, బొడ్డు రాజలింగం, బొజ్జ శ్రీను, పాత్తూరి మహేందర్, పాత్తూరి నర్సయ్య పాల్గొన్నారు.

వంతెన కల నిజమయ్యేనా.?

- ఇబ్బందుల్లో మూడు మండలాల ప్రజలు
- రూ.2 కోట్లతో ప్రతిపాదనలు
- సర్వేలతో సరిపెట్టారు
- నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌కు వినతి

ఎల్లారెడ్డిపేట: మూడు మండలాల ప్రజల చిరకాల వాంఛ దశాబ్దాలుగా నెరవేరడం లేదు. పాలకులు, అధికారులకు పట్టింపులేని కారణంగా ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. మండలంలోని అక్కపల్లి శివారులోని లేత మామిండ్ల వాగుపై వంతెన నిర్మించాలని ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. సర్వేల మీద సర్వేలు నిర్వహిస్తూ, ఒకటికి, రెండుసార్లు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినా, మంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు.

వర్షాకాలం పూర్తిగా ఈ దారిలో ప్రయాణాలు నిలిచిపోతాయి. జిల్లా, మండల కేంద్రాలకు బంధాలు తెగిపోతాయి. ఫలితంగా కోనారావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజలు పడుతున్న



వంతెన నిర్మించాల్సిన లేత మామిండ్లవాగు

ఇబ్బందులను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా నిధుల మంజూరుకు రెండేళ్ల క్రితం హామీ ఇచ్చారు. మంత్రి ఆదేశాలతో అధికారులు వంతెన నిర్మాణం కోసం ఎన్ని నిధులు అవసరమవుతాయనే దానిపై రెండేళ్ల క్రితం రూ.2 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. అధికారుల సర్వేతో ఇక లేత మామిండ్ల వాగుపై వంతెన నిర్మాణం అవుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

రెండేళ్లుగా ఎదురుచూపు

మంత్రి ఆదేశాలతో అధికారులు ఆగమేఘాల మీద సర్వేలు చేయడంతో వంతెన నిర్మాణం జరుగుతుందని, తమ కష్టాలు తీరుతాయని మూడు మండలాల ప్రజలు ఆశించారు. ఇదే ప్రాంతంలో మూడుసార్లు పర్యటించిన మంత్రి దృష్టికి వంతెన నిర్మాణం గురించి తీసుకెళ్లారు. ఏడాది క్రితం మరోసారి ఈ వంతెన సంగతిపై అధికారులతో కేటీఆర్ మాట్లాడారు. వెంటనే నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అయినా ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ఏళ్లు గడుస్తున్న వంతెన నిర్మాణం చేపట్టడం మరిచారు.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

వంతెన నిర్మాణం కోసం మంత్రి ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. నిధులు రాగానే పనులు చేపడుతామని అధికారులు దాట వేస్తున్నారు. అధికారులు పంపిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. పాలకుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. వంతెన నిర్మాణ ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని మంత్రి కేటీఆర్ వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వంతెన లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వాగు దాటి వెళ్లడం కష్టంగా ఉంది. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళితే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నిధుల జాడలేదు. ఈ వంతెన నిర్మిస్తే మూడు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– చల్ల నరేశ్‌రెడ్డి, అక్కపల్లి

మంత్రి స్పందించాలి



నిధుల మంజూరు విషయంలో మంత్రి కేటీఆర్ స్పందించాలి. వంతెన లేక అనేక అవస్థలు పడుతున్నాం. వర్షాకాలంలో వాగుదాటి వెళ్లే పరిస్థితి లేక మండల కేంద్రానికి రావడం కష్టంగా ఉంటుంది. 10 కిలోమీటర్లు ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. మంత్రి అధికారులతో మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయించాలి.

– గొగూరి ప్రదీప్‌రెడ్డి, అక్కపల్లి

ప్రతిపాదనలు పంపించాం

వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించాం. వంతెన నిర్మాణ వ్యయంపై సర్వేలు చేసి నివేదికలు సమర్పించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడుతాం. మంత్రి ఆదేశాలతో రెండోసారి కూడా సర్వేలు చేశాం. మండల వ్యాప్తంగా ప్రజలకు చాలా అవసరం ఉన్న వంతెనల గురించి ప్రభుత్వానికి నివేదించాం.

– కిరణ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

సమాచారం

నేడు తైబజార్ వేలం

రుద్రంగి: స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికిగాను తైబజార్ వేలం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ తర్రె ప్రభలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఆధ్యాత్మికం

రామాలయంలో అధ్యయనోత్సవాలు



బోయినపల్లి: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి, శ్రీ సీతారామ కల్యాణం పురస్కరించుకుని అధ్యయనోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పండితులు శ్రీరామ కల్యాణానికి సంబంధించిన ప్రవచనాన్ని అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కల్వకుంట్ల శ్రీనివాసచార్యులు, పండితులు సముద్రాల అనంతాచార్యులు, నమిలికొండ నర్సింహాచార్యులు, శ్రీపతి శ్రీనివాస్, హనుమాన దీక్షా స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా చౌడలమ్మ దేశపతిరాజుల కల్యాణం

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో శ్రీచౌడలమ్మ, దేశపతిరాజుల కల్యాణ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో చివరి రోజున కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయం పెద్దపట్నంతో వేడుకలు చేశారు. కల్యాణం అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ వనజ, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, గోపాల్‌రావు, శ్రీకృష్ణ యాదవ సంఘం బాధ్యులు అంజయ్యయాదవ్, ఎల్లయ్యయాదవ్, సత్తయ్యయాదవ్, లచ్చయ్య, దేవయ్య, మహేశ్, నాగరాజు, బాబు పాల్గొన్నారు.

విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లను ఆయుర్వేద వైద్యాధికారులు సోమవారం పంపిణీ చేశారు. రాగిలడ్డులు, ఆయుష్ కిట్లను విద్యార్థినులకు అందించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ కల్యాణి, కోఆర్డినేటర్ పద్మజ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు బొప్పాపూర్ ఆయుష్ వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్త్ కిట్లు, రాగిలడ్డూలను అందజేశారు. వైద్యాధికారి శ్రీనివాస్, ప్రత్యేకాధికారి వసంత, జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, ఎస్‌ఎమ్‌సీ చైర్మన్ నర్సింలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు జిల్లా సఖీ కేంద్రం ఆధ్వర్యంలో ఆయుష్ హెల్త్ కిట్లు అందజేశారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 190 మంది విద్యార్థులకు రాగి లడ్డూలు అందజేశారు. సఖి కేంద్రం



కోనరావుపేట: కిట్లు అందిస్తున్న వైద్యాధికారులు

కార్యదర్శి దేవిక, ఆయుష్ వైద్యాధికారి సదానందం, వైద్యాధికారి శరణ్య, భవాని శంకర్, స్పెషల్ ఆఫీసర్ శిరీష, పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ఆయుష్ కిట్లు, రాగి లడ్డూలు ఆయుర్వేద వైద్యాధికారి కల్యాణి పంపిణీ చేశారు. కిట్ల తప్పనిసరిగా వినియోగించుకుని పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ రాణి, లావణ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

జనావాసాల మధ్య మురుగు నీటి గుంత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామంలో జనవాసాల మధ్య ఉన్న మురుగు గుంత దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పలుసార్లు పాలకవర్గానికి, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ గుంతను పూడ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి, రామకృష్ణ, కార్యదర్శి, రాచర్లగొల్లపల్లి
ఫోన్ నంబర్: 70323 88848

పంచాయతీ భవనాలకు భూమిపూజ

రుద్రంగి: మండలంలో నూతనంగా ఏర్పడిన తండా గ్రామాలకు మంజూరైన జీపీ భవనాలకు, రోడ్లకు ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. గైదిగుట్ట తండా, వీరునితండా, చింతామని తండా, సర్పంచ్ తండా గ్రామ పంచాయతీ భవనాలకు రూ.20 లక్షల చొప్పున, దెగావత్‌తండా గ్రామంలో రూ.4 లక్షలతో, చింతామని తండా, సర్పంచ్‌తండా గ్రామాలలో రూ.3 లక్షలతో, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తండా గ్రామాల సర్పంచులు, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



భూమిపూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

దెగావత్ తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటి రెడ్డి, నాయకులు గంగం మహేష్, భూమా నాయక్ పాల్గొన్నారు.

యువత వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

వేములవాడఅర్బన్: యువత వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు జక్కని రాజు అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మారుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో మూడో రోజు ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితానికి ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోని ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం వలంటీర్లు గ్రామంలోని దారులను, పరిసరాలను శ్రమదానంతో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు నీలం శ్రీనివాసులు, నారాయణ, దీపిక, రమేశ్‌బాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



రహదారి శుభ్రం చేస్తున్న వలంటీర్లు

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: మండలం చిప్పలపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు ప్రారంభించారు. సర్పంచ్ తాడెపు జ్యోతి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, వైద్యాధికారి గీతాంజలి, సురేందర్‌రావు, ఎల్లం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చింతాల్‌ఠాణాలో..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ బూర వజ్రమ్మ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, సర్పంచ్ రాణి, కంటి వైద్యులు పాల్గొన్నారు.

అనంతపల్లి గ్రామంలో

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి గ్రామంలో ఉచిత కంటివెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం సర్పంచ్ వంగపల్లి సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్శ మల్లేశం, పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమిని, సూపర్‌వైజర్ శశికుమార్, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

అరెస్ట్‌లు అప్రజాస్వామికం

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా సోమవారం బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల యువమోర్చా అధ్యక్షుడు జితెందర్‌రెడ్డి అన్నారు. మంత్రి పర్యటన ఉన్న ప్రతిసారి అరెస్ట్‌లు చేయడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక పాలనను ప్రశ్నించే వారిని అణచివేస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో తిరగబడే రోజులు వస్తాయన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు దాసరి గణేశ్, సనత్ రెడ్డి, సాయి, రంజిత్‌కుమార్, కృష్ణహరి ఉన్నారు.

రైతులకు నాణ్యమైన సేవలందించాలి

- కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య

కోనరావుపేట: రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య అన్నారు. సోమవారం నిర్వహించిన కోనరావుపేట సింగిల్‌విండో సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రైతులకు అవసరమైన పంట రుణాలు, ఇతర రుణాలు అందిస్తున్నామన్నారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో తూకం ఎందుకు అధికంగా వేశారని రైతులు ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన లాభాల వివరాలను రైతులకు ఎందుకు తెలపడంలేదన్నారు. రైతులకు డివిడెండ్లు పంచివ్వాలని డైరెక్టర్ బానాపురం రంగారెడ్డి కోరారు. అలాగే సభలో ప్రవేశపెట్టిన నివేదికలో ఆదాయ వ్యయ వివరాలు సరిగా నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరైందికాదన్నారు. సమావేశంలో డైరెక్టర్లు రమ, గొట్టె మహేశ్వరి, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మంద రాజిరెడ్డి, అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ నర్సయ్య

రైతుల సంక్షేమమే సహకార లక్ష్యం

- ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పని చేస్తుందని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.36.50 లక్షల చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడానికి పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నామన్నారు. అనుబంధ రంగాలైన డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్ల పెంపకంతోపాటు బోరు మోటారు, పైప్‌లైన్ లాంటి వాటికి రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సహకార ఉద్యోగులకు ఉద్యోగ భద్రత

రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం జీవో 44ను జారీ చేసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఉత్తర్వు కాపీలను ఉద్యోగులు కిషోర్‌కుమార్, శ్రీబాబు, రాఘవేందర్, ఎల్లం, జంగం దేవయ్యకు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు ఎల్లయ్య, వెంకటనర్సింహరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సతీశ్, ప్రభాకర్‌రావు, రామచంద్రారెడ్డి, సుధాకర్, సీఈవో కిషోర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి

పేస్కేల్ అమలుకు కృషి చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి సిబ్బంది

వేములవాడరూరల్: ఉపాధిహామీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ తమకు పేస్కేల్ రావడం లేదని ఉద్యోగులు ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసిన వారు తమకు ప్రతీ నెల వేతనాలు రావడం లేదని తక్కువ వేతనాలతో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్య తీసుకెళ్లి వేతనాల పెంపు, పేస్కేల్ మంజూరు చేసేందుకు కృషి చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జి.రమేశ్, ఏపీవో మల్లయ్య, శ్రీనివాస్, తిరుపతి, కరుణాకర్, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వాడితే చర్యలు

ముస్తాబాద్: మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారిన పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకుంటామని మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజు అన్నారు. ముస్తాబాద్‌లో వస్త్ర, వాణిజ్య, కిరాణ వర్తక దుకాణాలతోపాటు హోటళ్లను సోమవారం తనిఖీలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ముస్తాబాద్‌గా తీర్చిదిద్దే క్రమంలో కాలుష్య కారకాలవుతున్న ప్లాస్టిక్ నియంత్రణకు అందరు సహకరించాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి అమలయ్యే నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ ఉద్యోగులు బిక్షపతి, జగన్, నరేశ్, రాజు, రవి పాల్గొన్నారు.

దళిత బంధు మాకెందుకు ఇవ్వరు.?

- ముఖానికి మాస్క్‌లతో నిరసన

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న తమకు దళితబంధు ఎందుకు ఇవ్వరని సోమవారం దళితులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ముఖానికి గుడ్డలు కట్టుకోని ఆందోళన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అందరికి దళితబంధు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం కొందరికే పథకాన్ని వర్తింపజేయడం అన్యాయమన్నారు. ఇదే మండలంలోని పదిరను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్న మంత్రి కేటీఆర్‌కు తాము ఓట్లు వేయలేదా అని ప్రశ్నించారు. దళితబంధుకు తమ అర్హులమా కాదా మంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సుమారు నాలుగు గంటల పాటు నిరసన, ఆందోళన చేశారు. కార్యక్రమంలో దళితులు చెన్నిబాబు, ఎర్పుల శ్రీనివాస్, అందే వీరయ్య, బక్కి రవి, దేవరాజు, దేవయ్య, తిరుపతి, ఎల్లయ్య పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులపై కేసు

సిరిసిల్లక్రైమ్: మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుల విష్ణు, మన్వాడ నందు, ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ సావనపల్లి ప్రశాంత్, ఏబీవీపీ సభ్యుడు మల్యాల రాకేశ్, ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు బామండ్ల నందు, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధవేణి సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. విద్యార్థి సంఘ నాయకులందరూ కరీంనగర్ నుంచి మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుని టీఎస్‌పీఎస్సీలో జరుగుతున్న అక్రమాలపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేసేందుకు వచ్చిన వారిగా పోలీసులు వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీటీసీ మధు, గ్రామశాఖ అధ్యక్షుడు లోకుర్తి బాల మల్లయ్య సోమవారం పంపిణీ చేశారు. జిల్లి సురేశ్‌కు రూ.25వేలు, గంట కృష్ణవేణికి రూ.20 వేలు, బర్కుటి లక్ష్మికి రూ.35 వేలు, గూడ సుజాతకు రూ.60 వేలు మంజూరు కాగా వారికి చెక్కులు అందించారు.

ప్రొసీడింగ్ కాపీలు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలం బండలింగంపల్లిలో 82 సంఘాలకు రూ.17.90 లక్షల వడ్డీ మాఫీ రుణాల ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్ కొత్తపల్లి వాణి సోమవారం అందజేశారు. ఎంపీటీసీ పద్మ,సీసీలు, వీఓఏలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

సర్వే ఎప్పుడు.?

ఇల్లంతకుంట: మండలంలో వారం రోజుల క్రితం కురిసిన వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను ఇంకెన్నడూ సర్వే చేస్తారని యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ప్రశ్నించారు. వడగళ్ల వర్షం కురిసి వారం కావస్తున్న ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదన్నారు.